రబీకి ఢోకా లేదు

పొదలకూరు ప్రాంతంలో అక్టోబర్ నెలలో ఆశించిన స్థాయిలోనే వర్షపాతం నమోదైంది. రబీలో సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. అయితే చెరువుల్లో ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే వర్షపు నీరు చేరినట్లు రైతులు తెలిపారు. నవంబర్ మాసంలో కూడా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండడం వల్ల రబీ సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు.

- ప్రాజెక్ట్‌లకు చేరుతున్న నీరు
- చెరువులకు సాగునీరు అందే అవకాశం
- వర్షపాతం తగ్గినా కాలువల ద్వారా నీరు
- సాగునీరు అందితే 20 వేల ఎకరాల్లో వరినాట్లు


కండలేరు ఏటి కాలువ (ఫైల్)

పొదలకూరు : మండల పరిధిలో మొత్తం 54 చెరువులు జలవనరులశాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. ఈ రబీలో దాదాపుగా అన్ని చెరువులకు ఏదోరకంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా సాగునీరు అందే అవకాశం ఉంది. అధికారులు రైతులను సమన్వయ పరిచి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తే మండలంలో 20 వేల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు వీలుకలుగుతుంది. అమ్మవారిపాళెం, పీజీపట్నం గ్రామ చెరువులకు మాత్రం దక్షిణ కాలువ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల చెరువుల్లోకి నీరు చేరే అవకాశం లేదు. కనుపూరు, దక్షిణ, ఎడమగట్టు, ఒకటో బ్రాంచి కాలువలు, కండలేరు ఏటికాలువ ద్వారా చెరువులకు సాగునీరు అందుతుంది. కల్యాణపురం పొట్టేళ్ల కాలువ చెరువు అప్పపీడనం వల్ల కురిసిన వర్షానికి నిండింది. దశల వారీగా చెరువులకు కాలువల ద్వారా నీటిని పెట్టేందుకు జలవనరులశాఖ అధికారులు షెడ్యూల్‌ను రూపొందిస్తే రబీసాగుకు ఇబ్బందులు తలెత్తవని రైతులు పేర్కొంటున్నారు.

చెరువులను నింపే అవకాశం

సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల ద్వారా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, నావూరుపల్లి చెరువులను నింపే అవకాశం ఉంది. వీటికి కాలువ నీటితో పాటు, వర్షం తోడు అయితే ఇబ్బందులు ఉండవు. ఎడమగట్టు కాలువల ద్వారా మొత్తం 32 చెరువులకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఇప్పటివరకు వర్షాధారంగా చెరువులకు 25 శాతం నీరు చేరింది. ఈ నీటితో రైతులు నార్లు పోసుకుంటే తర్వాత నాట్ల సమయంలో మరో 25 శాతం నీటితో కాలువ ద్వారా చెరువులను నింపే అవకాశం ఉంటుంది. కనుపూరు కాలువ ద్వారా మండలంలో చెరువులకు సాగునీటిని సరఫరా చేస్తారు. తాటిపర్తి, నల్లపాళెం, వెలికంటిపాళెం, నేదురుమల్లి, ఆనాటికండ్రిక గ్రామాలకు కనుపూరు కాలువ నీరు అందుతుంది. కండలేరు ఏటికాలువకు సైతం ప్రాజెక్టు లో-లెవల్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలను పండించవచ్చు. ఈ కాలువ కింద మనుబోలు మండలం వరకు రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని పెట్టుకుంటారు. కండలేరు ఒకటో నంబరు బ్రాంచి కాలువ ద్వారా మండలంలోని కొనగలూరు, దుగ్గుంటరాజుపాళెం, దుగ్గుంట, దేగపూడి, దేగపూడిరాజుపాళెం తదితర గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

సక్రమంగా సాగునీటిని అందివ్వాలి



ప్రాజెక్టుల్లోకి గణనీయంగా నీరు చేరుతున్నందున ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి సక్రమంగా సాగునీటిని అందిస్తే రబీలో వరిసాగుకు ఇబ్బందులు ఉండవు. ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు నాన్‌డెల్టా రైతులు ఆశిస్తున్న విధంగా అనుకూలమైన నిర్ణయాలు తీసుకుని సాగునీటిని విడుదల చేయిస్తే సాగుకు ఢోకా ఉండదు.

– కేతు రామిరెడ్డి, రైతు, కొనగలూరు

చెరువుల్లోకి నీరు

మండలంలోని చెరువుల్లోకి 25 శాతం నీరు వచ్చి చేరింది. ఇంకా వర్షసూచన ఉన్నందున వర్షాధారంగా చెరువుల్లో నీరు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నీటితో నార్లు పోసుకునే అవకాశం ఉంటుంది.

– అనిల్‌కుమార్, జలవనరులశాఖ ఏఈ, పొదలకూరు


నిండిన కల్యాణపురం చెరువు


కండలేరు ఎడమగట్టు కాలువ

ఐఏబీ సమావేశంపై ఆశలు

నాన్‌డెల్టా రైతాంగం ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. సోమశిలలో 55 టీఎంసీలు, కండలేరులో 35 టీఎంసీల నీటి నిల్వలు ఉండడం వల్ల ఈ రబీకి సాగునీటిని అందించే వెసులుబాటు ఉంటుందంటున్నారు. సాధారణంగా ప్రాజెక్టుల్లో తక్కువ నీటి నిల్వలు ఉంటే నాన్‌డెల్టాకు నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారేది. అధికారులు ముందుగానే రబీలో నాన్‌డెల్టా రైతులను వరి సాగు చేయవద్దని హెచ్చరించేవారు. అయితే ఈ రబీలో అలాంటి పరిస్థితులు ఉండవని భావిస్తున్నారు. ఏఏబీ సమావేశంలో నాన్‌డెల్టాకు సైతం నీటిని అందజేసే పరిస్థితులు ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. కండలేరు ఎడమకాలువ ద్వారా జలాశయంలో 35 టీఎంసీలు ఉంటేనే గ్రావిటీతో స్లూయిజ్ నుంచి నీటిని విడుదల చేయవచ్చు. ఇప్పటికే 35 టీఎంసీలు నీరు చేరడం వల్ల ఎడమ కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపేందుకు అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా

ప్రసన్నకు అభినందన

విడవలూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి పార్టీ మండల నాయకులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి ఆదివారం అభినందనలు తెలియజేశారు. ఆయనకు రాష్ట్రస్థాయి కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఆయనతో కలిసి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా బాలకృష్ణయ్య

పొదలకూరు : ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా ఇనుకుర్తి పంచాయతీ సెక్రటరీ పి.బాలకృష్ణయ్యను నియమించారు. ఈయన సోమవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. రెగ్యులర్ ఈఓపీఆర్డీగా చేజర్ల నుంచి ఇక్కడకు బదిలీ చేసినా ఆయన బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఎంపీడీఓ నరసింహారావు ఇనుకుర్తి సెక్రటరీకి బాధ్యతలు అప్పగించారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

పొదలకూరు : మండల పరిధిలో వరిసాగు చేసే రైతులకు విత్తనాలను సబ్సిడీపై అందజేస్తామని ఏఓ ఎ.వాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీపీటీ 5204, కేఎన్ఎం 1638 రకం విత్తనాలను కిలోకు రూ.5 వంతున రాయితీని అందజేస్తామన్నారు. కేఎన్ఎం 1638 రకం 90 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 20 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. బీపీటీలు 5204 రకం బస్తా(25 కిలోలు) వాస్తవ ధర రూ.1,045 కాగా రూ.124 రైతు సబ్సిడీ పోను రూ.920 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కేఎన్ఎం 1638 రకం బస్తా(30 కిలోలు) వాస్తవ ధర రూ.1,215 కాగా రూ.150 రైతు సబ్సిడీ పోను రూ.1,065 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతుకు బస్తా వంతున అందజేస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా సాగుదాం


సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు : కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని మిక్కిలింపేటలో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్థానిక దళితవాడలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలని సంకల్పించిందన్నారు. మిక్కిలింపేట రోడ్డు దుర్భరంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నందున తక్షణం తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకొంటానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్ఫూర్తి, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు జీవీఎస్.శేఖర్‌రెడ్డి, కె.అమరేంద్రరెడ్డి, ఎం.శ్రీహరిరెడ్డి, ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కోడూరు సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఆత్మగౌరవ వేదిక జిల్లా అధ్యక్షుడిగా కోసూరు


మాట్లాడుతున్న కోసూరు నారాయణ

తోటపల్లిగూడూరు : ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక జిల్లా అధ్యక్షుడిగా తోటపల్లి మాజీ సర్పంచ్ కోసూరు నారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆదివారం జిల్లా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కోసూరు నారాయణను జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక చేసింది. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభించే వరకు ఉద్యమిస్తామని, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆత్మగౌరవ వేదిక పోరాడుతుందన్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు అర్హుల ఎంపిక నేడు


ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

తోటపల్లిగూడూరు : దివ్యాంగులు, వయోవృద్ధులకు కావల్సిన ఉపకరణాలను అందించేందుకు అర్హుల ఎంపిక సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కాంపోజిట్ రీజినల్ వారి ఆధ్వర్యంలో క్యాంపు జరుగుతుందన్నారు. అర్హులైన వయోవృద్ధులు, దివ్యాంగులకు మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు మొదలైన ఉపకరణాలను అందిస్తామన్నారు. దివ్యాంగులు తమ సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో రావాలని, వయోవృద్ధులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పాటు రెండు ఫొటోలను క్యాంపునకు తీసుకురావాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే క్యాంపును వయో వృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాణసంచా పేలుళ్ల బాధితులకు పరామర్శ


బాధితురాలిని పరామర్శిస్తున్న డీఎస్పీ

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీలో ఇటీవల వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన బాణసంచా పేలుళ్లలో బాధితులను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. ఈ పేలుళ్లలో మంగమ్మ అనే ఒంటరి మహిళకు చెందిన రేకుల ఇల్లు పూర్తిగా దిబ్బతిని ఆమె వీధిన పడింది. ఈ విషయం తెలుసుకుని స్పందించిన ఎస్సై శివరాకేష్ ఆమెకు తన సొంత నిధులతో తిరిగి రేకుల ఇల్లును నిర్మించి ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్సై రాకేష్‌ను అభినందించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని దాతలు బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట సీఐ రాంబాబు, ఏఎస్సై జిలానిబాషా, రవిచంద్ర, కానిస్టేబుళ్లు మాధవరావు, ముఖేష్ తదితరులు ఉన్నారు.

జోరు వర్షాలకు రోడ్లు గుల్లగుల్ల


వర్షాలకు గుంతలమైన మామిడిపూడి రోడ్డు

ముత్తుకూరు : మండల పరిధిలోని తీరప్రాంతంలో వారం రోజులకుపైగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుల్లగుల్ల అయ్యాయి. నిలువెత్తు గుంతలతో నిండిపోయాయి. ముఖ్యంగా ముత్తుకూరు నుంచి మామిడిపూడికి వెళ్లే రోడ్డు బీసీకాలనీలో చిన్నాభిన్నమైంది. వర్షపునీరు నిలిచిన గుంతల్లో పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే, పనులు జరిగే క్రమంలో ఎన్నికల కోడ్ వచ్చింది. అనంతరం వర్షాలు కురవడం వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భగవద్గీత పఠనం.. సత్ప్రవర్తనకు మార్గం



సౌత్‌ఆములూరు గ్రామంలో నెల్లూరు కమిటీ సభ్యులు

తోటపల్లిగూడూరు : భగవద్గీత పఠనం.. సత్ప్రవర్తనకు మార్గం అని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సూరమౌళి పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు, ఆంజనేయపురం, చింతోపు, ముంగళదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ వారు భగవద్గీతతో పాటు వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సూరమౌళి మాట్లాడుతూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానుడు యుద్ధరంగంలో మొట్టమొదటి రోజున అర్జునునికి భగవద్గీత జ్ఞానం తెలియపర్చారన్నారు. గీతలో ఉన్న ధర్మాలను ప్రతిఒక్కరూ ఆచరించి శ్రీకృష్ణ పరమాత్మ లోకానికి ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు ప్రదీప్, నరసింహప్రసాద్, కల్పన, సుదర్శనమ్మ, రామయ్య, కొండమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


పురవీధుల్లో ఊరేగుతున్న దుర్గామాత

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో దసరా ముగింపు ఉత్సవాలను శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దుర్గాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాల వెలుగుల మధ్య ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన భేతాళ నృత్యం, కోలాటం, తప్పెట్లు, మంగళవాయిద్యాలు, వివిధ వేషధారణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అడుగడుగునా గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి మంగళహారతులు పట్టారు. యువకులు బాణసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట కేరింతలు కొట్టారు. పోలేరమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

ముగిసిన ప్రత్యేక యోగా శిబిరం



పొదలకూరు : పట్టణంలోని నిర్మలానంద నిత్య సాధన యోగా కేంద్రంలో ఐదు రోజుల పాటు మధుమేహ వ్యాధిపై ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ముగింపు సమావేశంలో యోగా గురువు రిత్‌దేవ్‌జీ మహరాజ్(హరిద్వార్) ప్రసంగించారు. ఐదురోజుల పాటు షుగర్ వ్యాధి నియంత్రణపై యోగాలో శిక్షణ ఇస్తామని వివరించారు. యోగా సాధన ద్వారా షుగర్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక యోగా గురువు సీహెచ్ పెంచలయ్య, లక్కాకుల ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల దినం

- మనుబోలు రక్తదాన శిబిరం


మనుబోలు : రక్తదానం చేస్తున్న దాతలు

మనుబోలు : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మనుబోలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సీఆర్ఆర్ కల్యాణ మండపంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఎస్సై శివరాకేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావచ్చని తెలిపారు. ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం దొరక్క ఇబ్బందులు పడుతుంటారని తెలియజేశారు. అలాంటి వారి ప్రాణాలను దాతలు ఇచ్చే రక్తం కాపాడుతుందన్నారు. మనుబోలు నుంచే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలను రెడ్‌క్రాస్ వైద్యుడు రామకృష్ణ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, బోలా శ్రీనివాసులు, ఉడతా విజయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మనుబోలు : మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు

రావి ఆకుపై..

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం ఆదివారం రావి ఆకుపై పోలీస్ అమరవీరుల సంస్మరణ చిహ్నాన్ని రూపొందించారు. సోమవారం పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అహర్నిశలు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసే పోలీసులకు ఈ చిత్రాన్ని అంకితమిచ్చారు.


ముత్తుకూరు : రావి ఆకుపై అమరవీరుల సంస్మరణ చిహ్నం

ఎక్కడి చెత్త అక్కడే


కొడవలూరులో రోడ్డు వెంబడి పేరుకుపోయి ఉన్న చెత్తా చెదారాలు

- వేధిస్తున్న దోమల బెడద

కొడవలూరు : మండల కేంద్రమైన కొడవలూరులో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఫలితంగా దోమల బెడద ఎక్కువైంది. దీంతో ఎప్పుడు ఏమి రోగాలు సోకుతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మూడ్రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీనివల్ల దోమల బెడద ఎక్కువై జ్వరాలు సోకే ప్రమాదం ఉంది. దీనికితోడు గ్రామంలోని ఎక్కడి చెత్త అక్కడ ఉండిపోయింది. ఈ చెత్తా చెదారాలు వర్షానికి తడిసి దుర్వాసన చిమ్ముతున్నాయి. ఈగలు, దోమల బెడద ఎక్కువైంది. దీంతో గ్రామస్తుల్లో దోమల బారిన పడి జ్వరాలకు గురికావల్సి వస్తుందన్న ఆందోళన అధికమైంది. వర్షాలు కురిసిన నేపథ్యంలోనైనా చెత్తా చెదారాలను తొలగించాల్సిన పంచాయతీ అధికారులు ఏమీ పట్టనట్లు ఉన్నారు. దీంతో దోమల బెడద ఎక్కువై రాత్రి వేళల్లో కునుకు తీయలేక పోతున్నామని, దోమల బారిన పడి ఎప్పుడు ఏం వ్యాధులు సోకుతాయోనని భీతిల్లుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి బ్లీచింగ్, స్ప్రే చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా వారూ ఏమీ పట్టనట్లు ఉన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల పంచాయతీ, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.